www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి


8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -228 శుక్రవారం 21 నవంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## గవర్నర్లు, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదంపై

# కాలపరిమితి విధించలేం



### సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు

- బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతి, గవర్నర్లకు కాలపరిమితి లేదు:
- అనవసర జాప్యం చేస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చు
- 'డీమ్డ్ అసెంట్' అనే భావన రాజ్యాంగ విరుద్ధమని స్పష్టీకరణ
- ఆమోదం నిరాకరిస్తే బిల్లును అసెంబ్లీకి తిరిగి పంపాల్సిందే
- సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు



**నవంబర్ 20ప్రజావినికిడి:**
రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదం తెలిపేందుకు ఎలాంటి కాలపరిమితి నిర్దేశించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, బిల్లుల ఆమోదంలో గవర్నర్లు అనవసరంగా, అంతులేని జాప్యం చేస్తే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చని, నిర్ణీత సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించవచ్చని తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 ప్రకారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన రిఫరెన్స్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తన అభిప్రాయాన్ని వెల్లడించింది. మిగతా 2లో...




# నితీశ్ ప్రమాణం

### 27మంది మంత్రులు కూడా ప్రమాణం

### ప్రమాణం చేయించిన గవర్నర్

### హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు



పాట్నా,: **నవంబర్ 20ప్రజావినికిడి:**
బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ మిగతా 2లో...

# తిరుమల కు రాష్ట్రపతి ముర్ము



తిరుమల,**నవంబర్ 20ప్రజావినికిడి:**
: రెండ్రోజుల పర్యటన నిమిత్తం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల చేరుకున్నారు. శ్రీపద్మావతి విశ్రాంతి గృహం వద్ద ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జానకీదేవి, భానుప్రకాశ్‌రెడ్డి, తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి.. రాష్ట్రపతికి స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. అంతకు ముందు రేణిగుంట విమానాశ్రయం నుంచి ద్రౌపది ముర్ము తిరుచానూరు వెళ్లి శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

## సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

### వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం

### జగన్ రాకతో అభిమానుల హల్‌చల్



హైదరాబాద్,**నవంబర్ 20ప్రజావినికిడి:**
అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదుమిగతా 2లో...

## కె టి ఆర్ పై విచారణకు

# గవర్నర్ అనుమతి

### ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి



హైదరాబాద్**నవంబర్ 20ప్రజావినికిడి:**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మిగతా 2లో...

# ఆపరేషన్ సంభవ్ సక్సెస్

### ఇది ఇకముందూ కొనసాగుతుంది

### రంపచోడవరంలో ఎన్‌కౌంటర్ ప్రాంతంలో పర్యటన

### స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించిన డిజిపి



రంపచోడవరం**నవంబర్ 20ప్రజావినికిడి:**
ఏపీలో ఆపరేషన్ సంభవ్ సక్సెస్ అయ్యిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్నారు. గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో రంపచోడవరం చేరుకున్న డీజీపీ.. ఏవోబీ ప్రాంతంలో ఏరియల్ సర్వే చేశారు. ఆపై జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన రెండు వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలించారు. ఏకే 47 గన్స్, రైఫిల్, పేలుడుకు ఉపయోగించిన వస్తువులను పరిశీలించారు. మిగతా 2లో...

## కడియం దానంకు నోటీసులు

### అఫిడవిట్ దాఖలు చేయాలి : స్పీకర్ ఆదేశం



హైదరాబాద్:**నవంబర్ 20ప్రజావినికిడి:**
ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంబందించి అనర్హత పిటిషన్లపై వివరణ కోరుతూ శాసనసభ్యులు కడియంశ్రీహరి, దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు ఇచ్చారుమిగతా 2లో...

# నిఖత్ పసిడి పంచ్

### 9 స్వర్ణాలు కొల్లగొట్టిన భారత్

### మొత్తం 20 పతకాలతో అదుర్స్

### వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్

గ్రేటర్ నోయిడా:**నవంబర్ 20ప్రజావినికిడి:**
వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. మొత్తం 20 మంది బరిలోకి దిగితే.. అందరికీ పతకాలు లభించాయి. మనోళ్లు ఏకంగా 9 స్వర్ణాలతో అదరగొట్టారు. మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్ (51 కిలోలు), మీనాక్షి హుడా (48 కి), ప్రీతి పవార్ (54 కి), జాస్మిన్ లంబోరియా (57 కి), పర్వీన్ (60కి), మిగతా 2లో...




# దేశమంతా సన్నబియ్యం ఇవ్వండి

### కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సలహా

### రాష్ట్రంలో ఈ పథకం సక్సెస్ అయ్యిందని వెల్లడి

### దీనివల్ల బియ్యం ధరలు స్థిరపడ్డాయని వివరణ

### సీఎం విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి



2లో.

# నితీశ్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# ఆపరేషన్ సంభవ్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్ కౌంటర్లలో 13 మంది మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. 50 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది జూన్‌లో రంపచోడవరంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో లొంగిపోవాలని మావోయిస్టులను హెచ్చరించామని తెలిపారు. మావోయిస్టులు లేని ఏపీగా చేయాలనుకున్నామని వెల్లడించారు. ఆపరేషన్ సంభవ్ కొనసాగుతుందని డీజీపీ హరీష్ గుప్తా స్పష్టం చేశారు. కాగా.. రెండు రోజుల క్రితం అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో అగ్రనేతలు నేలరాలిన విషయం తెలిసిందే. మొదటి ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణితో పాటు.. నలుగురు మావోయిస్టులు మరణించారు. రెండో రోజు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడు మంది మావోలు హతమయ్యారు. వీరిలో కీలక నేతలు కూడా ఉన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో లభించిన డైరీ ఆధారంగా ఏపీలోని పలు జిల్లాల్లో పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారికి వైద్య పరీక్షల అనంతరం ఆయా జిల్లాల కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు వారికి రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

# సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

(మొదటి పేజీ తరువాయి)

. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# గవర్నర్లు, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదంపై కాలపరిమితి విధించలేం

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ నిర్ణయం తీసుకోకపోతే, కోర్టులే బిల్లుకు ఆమోదం తెలిపినట్లుగా భావించే "డీమ్డ్ అసెంట్" అనే భావన రాజ్యాంగ స్ఫూర్తికి, అధికారాల విభజన సిద్ధాంతానికి విరుద్ధమని ధర్మాసనం పేర్కొంది. ఇది న్యాయవ్యవస్థ కార్యనిర్వాహక విధులను స్వీకరించినట్లే అవుతుందని అభిప్రాయపడింది.

అదే సమయంలో, ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ ఒక బిల్లుకు ఆమోదం నిరాకరిస్తే, దానిని తప్పనిసరిగా అసెంబ్లీకి తిరిగి పంపాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలా చేయకుండా తన వద్దే అట్టిపెట్టుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. గవర్నర్ల విచక్షణాధికారాల వినియోగంపై న్యాయసమీక్ష చేయలేనప్పటికీ, వారు సుదీర్ఘకాలం పాటు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉంటే మాత్రం కోర్టులు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది.గవర్నర్లకు కాలపరిమితి విధించడంపై గతంలో తమిళనాడు గవర్నర్ కేసులో ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్రపతి ఈ రిఫరెన్స్ చేశారు. దీనిపై పది రోజుల పాటు విచారణ జరిపిన ధర్మాసనం, ఈ మేరకు స్పష్టతనిచ్చినట్లు లైవ్‌లా తన కథనంలో పేర్కొంది. ఈ తీర్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తరచూ తలెత్తుతున్న ఈ వివాదానికి తెరపడినట్లయింది.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

## 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

అమరావతి,**నవంబర్ 20ప్రజావినికిడి:** నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం, రాబోయే 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశాలు ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ప్రమాదం పొంచి ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడి పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశముందని పేర్కొన్నారు.కొనసాగుతున్న అల్పపీడనం కారణంగా రాబోయే 24 గంటల్లో ప్రకాశం, బాపట్ల,కృష్ణా, తిరుపతి, చిత్తూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడవచ్చని తెలిపారు. శని, ఆదివారాల్లో ఓ మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. అల్లూరి జిల్లా జి.మాడుగులలో4.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ముంచంగిపట్టులో 5.8, చింతపల్లిలో 6.8, డుంబ్రిగూడలో 7.8 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# కడియం దానంకు నోటీసులు





.**(మొదటి పేజీ తరువాయి)** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారంటూ అరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందుకుగాను ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై విచారణ కొనసాగుతున్నది. దానం నాగేందర్, కడియంశ్రీహరి మాత్రం మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరారు. గురువారం ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుండటంతో మిగతా ఇద్దరికీ స్పీకర్ ఇంకోసారి నోటీసులు ఇచ్చారు. తన నోటీసులకు స్పందించి వెంటనే అఫిడవిట్ సమర్పించాలని స్పీకర్ ఆదేశించారు. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయసలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత స్పీకర్ తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్నట్టు అసెంబ్లీ అధికారవర్గాలు చెబుతున్నాయి. నాలుగు వారాల్లో ఈకేసుల్లో నిర్ణయం ప్రకటించాల్సి ఉన్న నేపథ్యంలో స్పీకర్ విచారణను వేగవంతం చేయడం గమనార్హం.న్యాయవాదుల వాదనలుఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడీ గాంధీ తరపున వారి న్యాయవాదులు స్పీకర్ ఎదుట హాజరై గురువారం వాదనలు వినిపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారణ కొనసాగింది. తమ క్లయింట్లు నియోజవవర్గాల అభివృద్ధి కోసమే సీఎంను కలిశారు తప్ప, పార్టీ మారడం కోసం కాదన్నారు.

# కె టి ఆర్ పై విచారణకు గవర్నర్ అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ భరించింది.

# దేశమంతా సన్నబియ్యం ఇవ్వండి

## కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సలహా

హైదరాబాద్**నవంబర్ 20ప్రజావినికిడి:** తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందనీ, దీన్ని దేశమంతా విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీనివల్ల పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గి, బహిరంగ మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయని వివరించారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని చెప్పారు. దీనిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుటుందని హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే



రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రానికి తగిన సహాయ సహకారాలు అందించాలంటూ సీఎం పలు అంశాలను కేంద్రమంత్రి వద్ద ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఏవై) అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీని కూడా విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలనీ, ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ సానుకూలంగా స్పందించారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందనీ, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించుకోవాలని సూచించారు.



# నిఖత్ పసిడి పంచ్

(మొదటి పేజీ తరువాయి)

అరుంధతి చౌధరి (70 కి), నూపుర్ షెరాన్ (80ం కి)తోపాటు సచిన్ (60 కి), హితేష్ (70 కి) పసిడి కాంతులీనారు. మొత్తంగా భారత్ (9 బంగారు, 6 రజత, 5 కాంస్య) 20 పతకాలు సాధించింది. గురువారం జరిగిన ఫైనల్లో నిఖత్ 5-0తో గువా యి గ్జువాన్ (చైనీస్ తైపీ)ని మట్టికరిపించింది. పారిస్ ఒలింపిక్స్ రౌండ్-16లో ఓటమి తర్వాత వరల్డ్ చాంపియన్ నిఖత్ తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంది. వేగంగా కదులుతూనే పవర్ పంచ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రతి రౌండ్‌లోనూ సాంకేతికంగా మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఈ పోటీల్లో నిఖత్ ఆడింది 2 బౌట్లు మాత్రమే. బై లభించడంతో ఆమె నేరుగా సెమీసలో తలపడింది. ఇక మీనాక్షి 5-0 తో ఆసియా చాంపియన్ ఫర్జోనా ఫొటిలోవా (ఉజ్బెకిస్థాన్)పై, అరుంధతి 5-0తో జొకిరోవా (ఉజ్బెకిస్థాన్)పై, ప్రీతి 5-0తో సిరిన్ చర్రా బి (ఇటలీ)పై, నూపుర్ 3-2తో సోతిమ్‌బయేవా (ఉజ్బెకిస్థాన్)పై, వరల్డ్ చాంపియన్ జాస్మిన్ 4-1తో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత ఉ షి (చైనీస్ తైపీ)పై, పర్వీన్ 3-2తో అయాక తగుచి (జపాన్)పై గెలిచి స్వర్ణాలు నెగ్గారు. అయితే, 80 కిలోల విభాగంలో కజ్మర్‌స్కా (పోలెండ్) చేతిలో ఓడిన పూజారాణి రజతానికే పరిమితమైంది. పురుషుల విభాగం ఫైనల్లో సచిన్ 5-0తో సీట్‌బెక్ (కిర్గిస్థాన్)పై, హితేష్ 3-2తో నూర్‌బెక్ (కజకిస్థాన్)పై నెగ్గి స్వర్ణాలు సాధించారు. జాదూమణి (50 కి), పవన్ బర్త్వాల్ (55 కి), అవినాష్ (65 కి), అంకుష్ (80), నరేందర్ (90ం కి) తుది పోరులో ఓడి రజతాలు దక్కించుకొన్నారు. ప్రతి ఒక్కరికీ పతకం: భారత్‌నుంచి మహిళలు, పురుషుల విభాగాల్లో పదేసి మంది చొప్పున 20 మంది దిగారు. వీరిలో ప్రతిఒక్కరూ పతకం సాధించారు. మహిళలకు 7 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు లభించాయి. పురుషులు 2స్వర్ణాలు, 5 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకున్నారు.

**టాప్ బాక్సర్లు దూరం..**

అగ్రశ్రేణి బాక్సర్లు చాలా మంది ఈ ఈవెంట్‌కు దూరం కావడంతో టోర్నీ కళతప్పింది. బాక్సింగ్ పవర్‌హౌస్‌లైన కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లు తృతీయ శ్రేణి జట్లను బరిలోకి దించడంతో మనోళ్లకు పెద్దగా పోటీ ఎదురుకాలేదు.

# పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక

## తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్

హైదరాబాద్,**నవంబర్ 20ప్రజావినికిడి:** పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్టిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి హాజరవుతారని




గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసలైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
శుక్రవారం 21 నవంబర్ 2025

# దళిత జర్నలిస్టు ఫోరం గౌరవ అధ్యక్షులుగా మంత్రి వివేక్ వెంకటస్వామి

**దళిత జర్నలిస్టు ఫోరం సభ్యులకు తన సంపూర్ణ మద్దతు..**

**గడ్డం వివేక్ వెంకటస్వామి కార్మిక, మైనింగ్ శాఖ, జియాలజీ శాఖ మంత్రి..**




**ప్రజావినికిడి,(హైదరాబాద్): నవంబర్ 20,**దళిత జర్నలిస్టు ఫోరం గత పదేళ్లలో జర్నలిస్టుల హక్కుల కొరకై ఎంతో పోరాటం చేశామని,దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ అన్నారు.దళిత జర్నలిస్ట్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కార్మిక, మైనింగ్ శాఖ, మరియు జియాలజీ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు,దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్ తెలిపారు.ఈ సందర్భంగా గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ,దళిత జర్నలిస్టు ఫోరం సభ్యుల డిమాండ్స్ ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి,వారి సమస్యలను పరిష్కరిస్తారని,ఫోరం సభ్యులకు తను ఎల్లవేళలా సహకరిస్తారని చెప్పారు.ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం తెలుగు రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి,మీసాల ఎల్లేష్,శ్రీకాంత్,గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు దొమ్మాట శివకుమార్,ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాపాక విజయ రాజు,పెద్దిగారి స్వామి రాష్ట్ర కార్యదర్శి,తదితరులు పాల్గొన్నారు

# ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రాపాక విజయరాజు..

**దళిత జర్నలిస్టు ఫోరం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రాపాక విజయరాజు నియామకం..**

**దళిత జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కమిటీలో స్థానం ఇవ్వాలని ఫోరం డిమాండ్..**

**ప్రజావినికిడి ,(హైదరాబాద్):**
దళిత జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తున్న దళిత జర్నలిస్టు ఫోరం (డీజేఎఫ్ ) కీలక నిర్ణయం తీసుకుంది. మెదక్ జిల్లా అధ్యక్షుడిగా రాపాక విజయరాజును నియమిస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కాశపోగు జాన్ ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్ర కార్యదర్శి ఏ.డేవిడ్ అధికారిక ప్రకటనను విడుదల చేశారు.ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు కాశ పోగు జాన్ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షునిగా రాపాక విజయరాజుకు నియామక పత్రం అందజేయడం జరిగింది.జిల్లా స్థాయి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి,జర్నలిస్టు సమస్యలను



మరింత ప్రభావవంతంగా పరిష్కరించడానికి రాపాక విజయరాజు నియామకం చేపట్టినట్లు ఫోరం తెలిపింది.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ మాట్లాడుతూ,దళిత జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని ఫోరం వ్యవస్థాపకుడు కాశపోగు జాన్ ప్రభుత్వం దృష్టికి రెండు ముఖ్యమైన డిమాండ్లను తీసుకొచ్చారు:
దళిత జర్నలిస్టులకు రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీలో తక్షణమే ప్రతినిధిత్వం కల్పించాలని.
అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని దళిత జర్నలిస్టులకు మొదటి విడతలోనే మంజూరు చేయాలని జర్నలిస్టుల హక్కుల కోసం ఫోరం ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని,దళిత జర్నలిస్టుల పురోగతికి ఈ నిర్ణయాలు అత్యంత కీలకమని కాశపోగు జాన్ స్పష్టం చేశారు.కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రాపాక విజయరాజు,మెదక్ జిల్లాలో దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి,శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తానని ఉమ్మడి జిల్లాలో ఉన్న దళిత జర్నలిస్టులందరినీ ఏకతాటిపై తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు యాదగిరి,ఎల్లేష్ జగత్ ప్రకాష్ పెద్దింటి స్వామి శ్రీకాంత్,శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కోసం పోరాడింది,పోరాడేది సిపిఐ పార్టీనే..

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ..**

**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):**
భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి బస్సు ప్రచార జాతా నేడు వివిధ జిల్లాలను ముగించుకొని జగద్గిరిగుట్ట గిరి నగర్ షాపూర్ నగర్ కి రావడం జరిగింది.ఈ జాతకు భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ ఏవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలివుల్ల ఖాద్రి ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు ఉప్పలయ్య రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డీజే నరేంద్ర ప్రసాద్ లు పాల్గొనగా సిపిఐ పార్టీ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి జగద్గిరిగుట్ట గిరి నగర్ షాపూర్ నగర్లలో సమావేశాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ,భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి సందర్భంలో దేశవ్యాప్తంగా శుద్ధ జయంతి ఉత్సవాలను నిర్వహించుకుని ఖమ్మంలో లక్షలాదిమంది ప్రజలతో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఆ బహిరంగ సభను జయప్రదం చేయడానికి కోసం రాష్ట్రవ్యాప్తంగా జాతాలను నిర్వహిస్తూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి పోరాటాలను ప్రజలకు తెలియజేస్తూ కమ్యూనిస్టు పార్టీ నిర్వహించినటువంటి సాయుధ పోరాటం దానివల్ల 3000 గ్రామాలను విముక్తి చేయడం 10 లక్షల ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకి మాత్రమే ఉన్నదని అన్నారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో భూ పోరాటాలు నిర్వహించి వందలాది ఎకరాలను లక్షలాదిమంది ప్రజలకు 60 గజాల భూములను ఇచ్చి ఇండ్లు స్థలాలు లేని వారికి ఇండ్ల స్థలాలను ఇప్పించినటువంటి చరిత్ర కేవలం కమ్యూనిస్టు పార్టీకే దక్కిందని, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం



నిత్యం పోరాటం చేస్తూ ప్రజా సమస్యలను తీర్చడంలో పెద్దన్న పాత్ర వహించుతూ నేటికీ 100 సంవత్సరాలుగా ప్రజల గుండెల్లో జీవిస్తూ ప్రజల సమస్యలను తీర్చేది కేవలం కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని అందుకే ఈ దేశంలో కమ్యూనిజం ఏ ప్రత్యామ్నాయమని అన్నారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో గుబురు గుట్ట గిరి నగర్ మగ్దుమ్ నగర్ భగత్ సింగ్ మార్క్ రావి నారాయణరెడ్డి నగర్ లెనిన్ నగర్ శ్రీనివాస్ నగర్ లాంటి అనేక కాలనీలను ఏర్పాటు చేసిన ఘనత స్థానిక సిపిఐ నాయకత్వానికి ఉందని అదేవిధంగా దుండిగల్ మండలంలో 600 ఎకరాలను రైతులకు పంచి కుత్బుల్లాపూర్ లో పేద ప్రజల కోసం పోరాటం చేసినటువంటి అసెంబ్లీ సీసాలు అయినటువంటి పార్టీ సిపిఐ పార్టీ అని అదేవిధంగా నేడు ప్రజలు కావలసినటువంటి ప్రభుత్వం మెడికల్ కాలేజ్ హాస్పిటల్, జగద్గిరిగుట్టలో ఆర్టీసీ బస్ డిపో,బస్తి దావకాన,భవనిర్మాణ కార్మికులకు 250 గజాల స్థలం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని కావున ప్రజలు దీన్ని గుర్తించి రాబోవు రోజుల్లో సిపిఐ నీ ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమాలకు సిపిఐ మండల కార్యదర్శి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్,శ్రీనివాస్, సీనియర్ నాయకులు యేసు రత్నం, వెంకటేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు,మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి,
సదానంద్,సహదేవ రెడ్డి,వెంకటేష్, దుర్గయ్య,సీనియర్ జర్నలిస్టు డప్పు రామస్వామి,
నరసయ్య,వీరస్వామి, సామెల్, కీర్తి,శ్రీనివాస్,చారి,
వెంకటాచారి,బాలరాజు , ఇమామ్,జార్జ్,బక్కరి మల్లేష్ కే శ్రీనివాస్ మహేందర్ కనకయ్య చంద్రకాంత్ అల్లాతో పాటు వందలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ జాతాకు సిపిఎం మండల కార్యదర్శి కే లక్ష్మణ్ నేతృత్వంలో సిపిఎం సిఐటి నాయకులు స్వాగతం పలికి శాలువలతో సత్కరించడం జరిగింది.

# కూన శ్రీశైలం గౌడ్ కు పలు ఆహ్వానాలను అందజేసిన పార్టీ నాయకులు,అయ్యప్ప స్వాములు



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసంలో నియోజకవర్గం నాయకులు,అయ్యప్ప స్వాములు మాజీ ఎమ్మెల్యే ని కలిసి ఆహ్వానాలను అందజేయడం జరిగింది.అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలను స్వీకరించి సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల పెన్నిధి సీఎం సహాయ నిధి

**-మాజీ డిప్యూటీ మేయర్,మాజీ కార్పొరేటర్లు**



**ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మంజూరు చేయించిన 73,500/- రూపాయల విలువగల సీఎం సహాయనిధి చెక్కులను నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ కు చెందిన ముగ్గురు -3 లబ్ధిదారులకు మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు పెద్దిరెడ్డి సుజాత, బాలాజీ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు

# ఫారెస్ట్ ఆఫీసర్ తో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమీక్ష సమావేశం




ఫారెస్ట్ అధికారి ఓం ప్రకాష్ చే మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**రెండు రోజుల క్రితం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు నిన్న మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,ఫారెస్ట్ ఆఫీసర్ ఓం ప్రకాష్ అలాగే మాజీ బి.ఆర్.ఎస్.పార్టీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు మన్సూరాబాద్ ఫారెస్ట్ కుంటను ఆటోనగర్ డంపింగ్ యార్డును పరిశీలించడం జరిగినది.డంపింగ్ యార్డ్ నుంచి జంతువుల కళేబరాల నుంచి వస్తున్న కల్టివేటెడ్ వాటర్ ఫారెస్ట్ కుంటలో నిలువ ఉండి చుట్టూ పక్కల 20 కిలోమీటర్ల వరకు వాసన విస్తరించి వృదులకు శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిసిన నేపథ్యంలో గురువారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓం ప్రకాష్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు చే సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఆటో నగర్ డంపింగ్ యార్డు నందు వాసన రాకుండా చూడాలని ఆదేశించారు.దానిలో భాగంగా సుధీర్ రెడ్డి హైడ్రా,జీ.హెచ్.ఎం.సీ,ఫారెస్ట్,హైలా,పొల్యూషన్ ఇతర అధికారులచే ఫోన్లో మాట్లాడి అక్కడ నిల్వ ఉన్న మురికినీటిని తరలించడానికి ట్యాంకర్లు పంపాలని కోరడం జరిగింది.దానికి హైడ్రా వారు సానుకూలంగా స్పందించి వెంటనే పంపిస్తామని తెలిపారు.అలాగే జంతు కళేబరాలు వ్యర్థ మెటీరియల్ పోసే వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లో అట్టి ప్రాంతాల్లో ఎలాంటి దుర్గంధ వాసన రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.దానిలో భాగంగా అధికారులు మోటార్లు పంపి నిలువ ఉన్న మురికినీటిని తరలించారు.అలాగే జంతు కళేబరాలు మరియు ఇతర వ్యర్థ పదార్థాలు పోసే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని అధికారులు సుధీర్ రెడ్డి కి తెలిపారు.దానికి గాను చుట్టుపక్కల కాలనీవాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి ప్రదాత కేటీఆర్ పై అక్రమ కేసులా..?

**ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..**




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
ఫార్ములా-ఈ రేస్ నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్రానికె కాకుండా హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు వేయిల కోట్ల ఆదాయం,పెట్టుబడులు తెలంగాణ రాష్ట్రానికి వచ్చాయని ఇదంతా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వల్లనే సాధ్యమైందని రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలను,అభివృద్ధిని చూస్తే కేటీఆర్ గొప్పతనం తెలుస్తుందని,అది మరిచి రాబోయే స్థానిక ఎన్నికలలో లబ్ధి పొందడానికి కేటీఆర్ పై విచారణకు ఆదేశించడం రాజకీయంగా లబ్ధి పొందడానికే రేవంత్ రెడ్డి ఆడుతున్న డ్రామాని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి విమర్శించారు.స్థానిక ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్ములా-ఈ కేసును డైవర్షన్‌లా వాడుకుంటుందన్నారు

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




**ప్రజావినికిడి,(ఉప్పల్):నవంబర్20,**విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.రామంత పూర్ లో గల ఎస్ వి గ్రామర్ హై స్కూల్లో జరిగిన సైన్స్ ఫేర్ ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.అనంతరం స్కూల్ లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫేర్ లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు, బీఆర్ఎస్,రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు,స్కూల్ యాజమాన్యం వెంకటేశ్వర్లు,విజయ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలకు విద్యుత్ మీటర్లు..

## విద్యుత్ శాఖలో అవినీతి అధికారులు..

**అక్రమ నిర్మాణమైన సరే లంచాలు ఇస్తే విద్యుత్ మీటర్లు ఇస్తాం..**

**విద్యుత్ శాఖ అధికారులకు ఆదాయమే ముఖ్యమా, నిబంధనలు గాలికేనా..?**

**అనుమతులు లేకున్నా విద్యుత్ మీటర్లు ఇవ్వవచ్చా..**

**ప్రభుత్వ శాఖలకు ఆదాయం భారీగా గండి కొడుతున్న అక్రమ అపార్ట్మెంట్ నిర్మాణాలు..**

**అక్రమ మీటర్లు,ట్రాన్స్ ఫారం లు ఇచ్చి కోట్లు గడిస్తున్న లైన్ మెన్, ఏఈ,ఎడిఈ,డిఈ లు**

**విద్యుత్ శాఖలో విజిలెన్స్ విభాగం పేరుకేనా..? అవినీతిమాయమా..?**



**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
గ్రేట్ హైదరాబాద్ అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారిందని గల్లీ చిన్నదైనా అక్రమ నిర్మాణం మాత్రం పెద్దదిగా ఉంటుంది. అనుమతులు జి ప్లస్ టు తీసుకొని అధికారులకు లంచాలు ఇచ్చి ఎంత పెద్ద నిర్మాణమైన చేసుకోవచ్చన్న దిమ గ్రేటర్ హైదరాబాద్ లో బిల్డర్లకు, నిర్మాణదారులకు ఒక దిమ ఏర్పడింది. ఎందుకంటే అధికారులు లంచాలు తీసుకొని ఎలాంటి నీచానికైనా ఒరగడుతున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు అంటే వాళ్లకు అసలు లెక్కలేదు.ఫిర్యాదులు చేస్తే ఉన్నత అధికారులు చర్యలు తీసుకోరు,దానితో అక్రమాలు అవినీతి చేయడంలో ప్రభుత్వ అధికారులు నంబర్ వన్ స్థానంలో నిలుస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు రాజకీయ నాయకుల,ప్రజా ప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో గ్రేటర్ హైదరాబాదులో ఆ పార్టీ, ఈ పార్టీ అని లేకుండా ఏ పార్టీ నాయకులైన అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ అక్రమ సంపాదన తమ జేబుల్లో వేసుకొని రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ నిర్మాణాల కు వత్తాసు పలుకుతున్నారు. అక్రమ నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తే జిహెచ్ఎంసి అధికారులు అక్రమ నిర్మాణం చేపడుతున్న ఇంటి యజమానికి నోటీసులు ఇవ్వగానే కొంతమంది చిల్లర రాజకీయ నాయకులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫోన్లు చేసి ఆ ఇంటి నిర్మాణం మా కులపోడిది,మా బామ్మర్ది ది,మా బావది,మా అన్నది, మా పార్టీ వానిది అని లేనిపోని వరుసలు కలిపి అక్రమ నిర్మాణానికి రాజకీయ నాయకులు సిగ్గులేకుండా వత్తాసు పలుకుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటే వారిపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ల తోపాటు చోటా బడా నాయకులు అందరూ టౌన్ ప్లానింగ్ అధికారులపై గుర్రుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై స్థానికుల ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవాలా లేదా అని టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రశ్నిస్తే మీ పని మీరు చేయండి మా పని మేము చేసుకుంటాం అని సమాధానం చెబుతున్నారని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్న తదనంతరం అక్రమ నిర్మాణదారులు ప్రభుత్వ నిబంధనలో లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలు తిరిగి చేపడుతున్నారని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెడదామంటే పోలీస్ శాఖ అధికారులకు రాజకీయ నాయకులు ఫోన్ చేసి ఆ బిల్డింగ్ మా వారిదే వాటిపై ఎలాంటి కేసులు పెట్టొద్దని వారికి కూడా ఫోన్ చేసి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు కొంతమంది చిల్లర రాజకీయ నాయకులు అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న బిల్డింగుల ను సీజ్ చేసినా కూడా సీజింగ్ బోర్డులను యదేచ్ఛగా తొలగించి పనులు చేపడుతున్నారని పోలీస్ శాఖ అధికారులకు వాటిపై ఫిర్యాదు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం లేదని దానితో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని తొలగించాలని పోలీసు అధికారులకు తెలిపిన సిబ్బందిని ఇవ్వడంలేదని,అక్రమ నిర్మాణ దారులకు రాజకీయ నాయకుల అండదండ తో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

### అక్రమ నిర్మాణాలకు జోరుగా విద్యుత్ మీటర్లు,ట్రాన్స్ ఫారం లు

అక్రమ నిర్మాణాలకు విద్యుత్ శాఖ అధికారులు కరెంటు మీటర్లను నిబంధనలకు విరుద్ధంగా, అదనంగా ఎందుకు ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లైన్ మెన్,ఏఈ, ఏడిఈ,డిఈ లు మాకు అక్రమ ఆదాయమే ముఖ్యమని అది అక్రమమా సక్రమమా అని మేము చూడమని ఎవరికి ఎన్ని మీటర్లు కావాలన్నా పానెల్ బోర్డు కావాలన్నా లంచాలు ఇస్తే మేము ఇస్తామని అని పోటీపడి అవినీతి అక్రమాలు జోరుగా చేస్తుంటే విజిలెన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అదే వినియోగదారుడు అక్రమ కనెక్షన్ తీసుకున్నాడని కరెంటు బిల్ కట్టలేదని ఎన్నో రూల్స్ చెప్పే అధికారులు మరి అక్రమ మీటర్లను అక్రమ ట్రాన్స్ఫర్లను ఎలా ఏర్పాటు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లంచాలు ఇస్తే రూల్స్ ఉండవా వాటిని పాటించవలసిన అవసరం లేదా అలాంటప్పుడు ప్రభుత్వ నియమ నిబంధనలు ఎందుకని విద్యుత్ శాఖ అధికారులకు ప్రభుత్వ నియమ నిబంధనలు పట్టవా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### పేరుకే విజిలెన్స్ చర్యలలో శూన్యం

గ్రేటర్ హైదరాబాద్ తో పాటు తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి బిల్డర్లు రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని ఆరు ఏడు అంతస్తుల వరకు అక్రమ నిర్మాణాలు చేస్తుంటే విద్యుత్ శాఖ అధికారులు వాటికి మీటర్లను ట్రాన్స్ఫారాలను ఏ ప్రతిపాదికన ఏర్పాటు చేస్తున్నారని ఒకవేళ ఏర్పాటు చేస్తే ప్రజలు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వాటిని తొలగించాలని లేనిపక్షంలో ప్రభుత్వ నియామ నిబంధనలు ఉల్లంఘించినందుకు లంచాలు తీసుకొని ప్రభుత్వ రూల్స్ బ్రేక్ చేసినందుకు అధికారులపై శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టాలని సామాజిక కార్యకర్తలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ వ్యాప్తంగా అనేక అవినీతి అక్రమాలు జరుగుతుంటే స్టేట్ విజిలెన్స్ డిపార్ట్మెంటల్ విజిలెన్స్ ఏం చేస్తున్నారని అధికారులు కేవలం జీతాలు తీసుకొని ఇలాంటి అవినీతి అధికారులను ఎంకరేజ్ చేసి వాళ్ళ దగ్గర నుండి కూడా మామూలు తీసుకుంటున్నారా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖలో ఇష్టారాజ్యంగా మీటర్లు ఇవ్వడం వల్ల అక్రమాలు సక్రమమవుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు మీటర్లను జలమండలి శాఖ అధికారులు తాగునీరు,డ్రైనేజ్ కనెక్షన్లను ఎలాంటి పరిస్థితుల్లో ఇవ్వకూడదని ఒకవేళ ఇస్తే సాధారణ పౌరుడు ఫిర్యాదు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమంగా ఇచ్చిన మీటర్లను ట్రాన్స్ఫారాలను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు.లేదా విద్యుత్ శాఖలో ప్రభుత్వ నియమ నిబంధనలు తొలగించి సిబ్బంది అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడే అవకాశం కల్పించాలని ఎందుకంటే ప్రభుత్వ రూల్స్ ఉన్న పాటించని అధికారులకు ప్రభుత్వ నియమ నిబంధనలు ఎందుకని ప్రజలు రాష్ట్ర మంత్రులను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై రాష్ట్ర మంత్రులు ముఖ్యమంత్రి ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

---

# భార్యను గొంతుకోసి హత్య చేసిన భర్త

## కూతురిపై కూడా దాడి -మూడు వేళ్లు తెగిపోవడంతో ప్రాణాలతో బయటపడిన చిన్నారి భర్త అదుపులోకి తీసుకున్న ఖమ్మం పోలీసులు

**ఖమ్మంనవంబర్ 20ప్రజావినికిడి:**



ఖమ్మం నగరంలోనూ పగటిపూట భయాందోళనకు గురిచేసిన కిరాతక హత్య ఘటన చోటుచేసుకుంది. కొత్త మున్సిపాలిటీ సమీపంలోని లయన్స్ క్లబ్ పక్కనున్న సందులో భాస్కర్ అనే వ్యక్తి తన భార్య సాయి వాణి (31)ని కత్తితో గొంతు కోసి అతి దారుణంగా హత్య చేశాడు. హత్యకు ముందు భాస్కర్ మొదట తన చిన్న కుమార్తెపై కత్తితో దాడికి ప్రయత్నించగా, చిన్నారి చాకచక్యంగా తప్పించుకోవడంతో తీవ్ర విషాదం తప్పింది. దాడిలో ఆమెకు మూడు చేతి వేళ్లు తెగిపోయినట్లు పోలీసులు తెలిపారు. భాస్కర్%–%సాయివాణి దంపతుల మధ్య గత కొంతకాలంగా కలహాలు కొనసాగుతున్నాయి. కుటుంబ సమస్యల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు ప్రాథమిక సమాచారం. మృతురాలు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన సాయివాణి గా పోలీసులు గుర్తించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. హంతకుడు భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

# 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

## బండి సంజయ్‌పై కేసు కొట్టివేసిన హైకోర్టు -మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి

హైదరాబాద్,**నవంబర్ 20ప్రజావినికిడి:**
కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ



కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

# పుట్టపర్తిలో గడ్కరీ దంపతుల పూజలు



పుట్టపర్తి,ఇ సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తిలోని సాయికుల్వంత హాల్లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దంపతులు పాల్గొన్నారు. సాయి బోధనలు తనపై చూపిన ప్రభావాన్ని, అనుభూతులను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ.. తాను ఎవరికీ బోధించడానికి రాలేదని, ఇక్కడి భక్తి, విలువలు, సేవా భావాన్ని చూసి.. ఎక్కువ పని చేసేందుకు ప్రేరణ పొందడానికే వచ్చానని చెప్పారు. జీవితంలో శాంతి ఎంతో ముఖ్యమని, అది ఉంటే సమస్యలను సులువుగా పరిష్కరించవచ్చని చెప్పారు.

-----------

## డిసెంబర్1న సామూహిహిక వందేమాతరం గీతాలపన

హైదరాబాద్,**నవంబర్ 20ప్రజావినికిడి:** డిసెంబర్ 1వ తేదీన పటాన్ చెరు పట్టణంలో నిర్వహించ తలపెట్టిన వందేమాతరం 150 వసంతాల సామూహిక గీతాలాపన కార్యక్రమ ఏర్పాట్లను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పటాన్ చెరు పట్టణంలోని నొవపాన్ పరిశ్రమ సమీపంలో గల ఖాళీ స్థలంలో కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 30 వేల మంది విద్యార్థులు ఒకే సమయాన సామూహిక గీతాలాపన చేసేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ డీఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

----------

## కెటిఆర్, గోరటిలపై ఎన్నికల కేసు కొట్టివేత



హైదరాబాద్,**నవంబర్ 20ప్రజావినికిడి:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నల కు తెలంగాణ హైకోర్టులో ఊరట దొరికింది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో వారిద్దరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన కేసులో ఊరట లభించింది. 2023 ఎన్నికల సమయంలో తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద ఇంటర్వ్యూలు చేశారని కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోడ్ ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారనీ పోలీసులు కేసు పెట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. ప్రభుత్వ పథకాలపై గోరెటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని విచారణ సందర్భంగా పోలీసుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ది చేకూర్చే విధంగా ఆ ఇంటర్వ్యూ ఉందని తెలిపారు. అయితే, రాజకీయ లబ్ది కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్, గోరెటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

## స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక

### డిసెంబర్ 11లోపు నోటిఫికేషన్‌కు ఛాన్స్ -పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్,:**నవంబర్ 20ప్రజావినికిడి:**
:పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో డిసెంబరు 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. ఇదిలావుంటే వచ్చే నెల డిసెంబర్ 11వ తేదీ లోపు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



చెప్పారు. గురువారం కామారెడ్డి జిల్లా భిక్కనూరులో జరిగిన సభలో ఆమె మాట్లాడారు. అనంతరం మండలంలోని బస్వాపూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముందుగా గ్రామ పంచాయతీలకు, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని అన్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందుగా నిర్వహించకపోతే మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ల్యాప్స్ అవుతాయని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న రిజర్వేషన్ల ప్రకారమే 27 శాతం బీసీ రిజర్వేషన్లతో ముందుకు పోతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో రూ.92.80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క భూమిపూజ చేశారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి రుణాలు మంజూరు చేస్తుందన్నారు. స్వయం ఉపాధితోపాటు వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని.. ఇందుకోసం ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తోందన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన నిహారికకు అభినందనలు

**అనంతగిరినవంబర్ 20ప్రజావినికిడి:**
ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బొమ్మలరామారం లో నిర్వహించిన అండర్%-%14 వాలీబాల్ బాలికల విభాగంలో సూర్యాపేట జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ జట్టులో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గోండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి. నిహారిక రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికైంది. ఈ నెల 26 నుండి 28 వరకు పెద్దపల్లి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో సూర్యాపేట జిల్లా తరఫున నిహారిక ప్రతినిధులుగా పాల్గొననుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అనంతగిరి మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు గ్రామస్థులు నిహారికను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఎత్తులకు ఎదగాలని ఆశీర్వదించారు.



## విద్యతోనే వికాసం - పాపిరెడ్డి

### ప్రతిభా పోటీల్లో విద్యార్థుల మెరుపు -లయన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ సౌజన్యంతో కార్యక్రమం







**హనుమకొండనవంబర్ 20ప్రజావినికిడి:**
ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ధర్మ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఈ పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆర్మీ సైనికుడు, ప్రభుత్వ దేవాదాయ శాఖ మాజీ అధికారి మరియు ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి పాపిరెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ప్రసంగిస్తూ %-% "క్రమశిక్షణ, కృషి, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు. శాస్త్ర%-%సాంకేతిక రంగాల్లో పురోగమనం సాధించినప్పుడే భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తుంది" అని అభిప్రాయపడ్డారు. విశ్రాంత అటవీ అధికారి, లయన్స్ క్లబ్ ఆఫ్ మడికొండ అధ్యక్షులు మనోహర స్వామి మాట్లాడుతూ %-% తన అమెరికా సందర్శన అనుభవాలను పంచుకున్నారు. భారత విద్యారంగం%-%అమెరికా విద్యారంగం మధ్య వ్యత్యాసాలను విద్యార్థులకు వివరించి, "అవకాశాలు లభించిన ప్రతిసారి వాటిని సద్వినియోగం చేసుకుంటే ఆకాశమే హద్దు" అని ప్రోత్సహించారు. ఈ సందర్భంలో హిందీ ఉపాధ్యాయురాలు పద్మజ క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రేణుక, మధుప్రియ, అజయ్, లాస్య, ప్రశాంత్, సింధు, ప్రియాంకలకు లయన్స్ క్లబ్ సభ్యులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీధర్, ఉపాధ్యాయులు కవిత, సురేష్ రాజమ్మ, కిరణ్ మై, రామకృష్ణ పాల్గొన్నారు.

## 102 అమ్మ ఒడి వాహన గర్భిణీలకు మేలు



**నవంబర్ 20ప్రజావినికిడి:**సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 102 అమ్మ ఒడి వాహన సేవలను జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఇమామ్ పాషా, ప్రోగ్రామ్ మేనేజర్ సలీం పరిశీలించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో, రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రారంభించిన ఈ సేవలను ప్రతి గర్భిణీ, ప్రసూతి సురక్షితంగా ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో చెకప్లు, నెలవారీ టీకాలు, ప్రసవం తర్వాత తల్లి-శిశువులను సురక్షితంగా ఇంటికి చేర్చడానికి 102 వాహనం ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## రహదారుల వెంట ధాన్యం ఆరబోసుకునే పరిస్థితి.



**నవంబర్ 20ప్రజావినికిడి:**
అనంతగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు స్థలాల సమస్యగా మారింది. ప్రభుత్వ భూములు లభ్యం కాకపోవడంతో రహదారుల వెంట ధాన్యం ఆరబోసుకునే పరిస్థితి నెలకొంది. దీనివల్ల రవాణా, రక్షణ, రికార్డు నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదురయ్యుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో పండిన వరి చేతికొచ్చింది. తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధరగా ఏగ్రేడ్ క్వింటల్‌కు రూ.2389, సాధారణ రకానికి రూ.2369, అలాగే సన్నానికి క్వింటాకు రూ.500 బోనస్ కలిపి చెల్లిస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వరుసలు కడుతున్నారు. అనంతగిరి మండలం పాలవరం, శాంతినగర్, అమీనాబాద్, వాయిలి సింగారం, త్రిపురవరం, ఖానాపురం, బొజ్జగూడెం తండా గొండ్రియాల వంటి గ్రామాల్లో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా, సరైన ప్రభుత్వ భూములు లభించకపోవడంతో సమస్యలు ఎక్కువయ్యాయి. కొన్ని కేంద్రాల్లో రహదారుల వెంట ధాన్యం రాశులు నిల్వ చేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందోమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, రైతులు మరోవైపు నిల్వ చేసిన ధాన్యం భద్రతపై భయాందోళన చెందుతున్నారు. "తక్షణం ఉపశమనం కల్పించేలా ప్రభుత్వం శాశ్వత స్థలాలు ఏర్పాటు చేయాలి. రహదారుల పక్కన ధాన్యం ఉంచడం ప్రమాదకరం" అని అన్నదాతలు కోరుతున్నారు. ధాన్యం తడిసిపోవడం, నాణ్యత తగ్గిపోవడంతో రైతులకు నష్టం కలిగే అవకాశాలు ఉన్నందున, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తగిన భూములను కేటాయించి సకల సదుపాయాలు ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యం

### - నాగా సీతారాములు



**కొత్తగూడెం/నవంబర్ 20ప్రజావినికిడి:**
58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం కొత్తగూడెం గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. సమాజంలో ఆదర్శంగా నిలవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవి ప్రసన్న, లైబ్రరీయన్స్ కరుణ కుమారి, నవీన్, మృదుల తదితరులు పాల్గొన్నారు.

## భార్యాపిల్లల హత్య కేసు -నిందితుడికి ఉరిశిక్ష ఖరారు

### వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు

వికారాబాద్,:**నవంబర్ 20ప్రజావినికిడి:** భార్య, పిల్లల్ని దారుణంగా హత్య చేసిన కేసులో వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లాలో 2019లో ప్రవీణ్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లల్ని చంపేశాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అయితే, ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది. ఈ మేరకు కేసును విచారించిన వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. భార్య, పిల్లలను చంపిన కేసులో నిందితుడికి కోర్టు ఉరి శిక్ష ఖరారు చేసింది. 2019లో భార్య, ఇద్దరు పిల్లలను ప్రవీణ్ అనే వ్యక్తి చంపాడు. భార్య, పిల్లల హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. ప్రవీణెళి భార్య, పిల్లలను చంపాడని



రుజువు కావడంతో కోర్టు ఉరిశిక్ష విధించింది. పోలీసుల సమాచారం ప్రకారం.. ప్రవీణ్ కుమార్(32) వృత్తిరీత్యా ప్రయివేటు ఉద్యోగి. వికారాబాద్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉండేవాడు. భార్య చాందినీకి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమెను ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. ఐదేండ్ల కుమార్తె ఇన్షిల్‌ను, తొమ్మిదేళ్ల కుమారుడు అయాన్ కూడా హతమార్చాడు. అయితే చాందిని ప్రవీణ్‌కు రెండో భార్య. కాగా కుమారుడు అయాన్ చాందినికి మొదటి భర్త సంతానం. ఇన్షిల్ మాత్రం ప్రవీణ్ కూతురే. ఇక భార్య చాందిని మొబైల్‌లో సందేశాలు చూసి ప్రవీణ్ తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యాడు. తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడని దర్యాప్తులో బయటపడింది. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే వారిని హత్య చేసిన అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటికీ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. నేరం తీవ్రత, ఆధారాలను పరిశీలించిన వికారాబాద్ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది

# అమెరికాతో 93 మిలియన్ డాలర్ల ఆయుధ ఒప్పందం

## అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ సరఫరాకు అంగీకారం

వాషింగ్టన్, **నవంబర్ 20ప్రజావినికిడి:**
భారత్-అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. భుజం మీద నుంచి గురిపెట్టి ప్రయోగించే ఈ మిసైల్.. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది. ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్ విధ్వంసకర ఆయుధాన్ని ప్రయోగించిన ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ



కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా.రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మొత్తం 93 మిలియన్ డాలర్ల ఆయుధాలను విక్రయించేందుకు భారత్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ మిసైల్ వ్యవస్థలు, సంబంధిత హార్డ్‌వేర్‌ను అగ్రరాజ్యం అందించనుంది. దీంతోపాటు 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజె÷-టక్టైల్స్, ఇతర సైనిక పరికరాలను విక్రయించనుంది. తొలివిడతలో భాగంగా జావెలిన్ ఎఫ్‌జీఎం-148 మిసైల్స్, 25 జావెలిన్ లైట్‌వెయిట్ కమాండ్ లాంఛ్ యూనిట్స్ వంటి వాటిని భారత్‌కు అందించనుంది.

## ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన శ్రీనగర్‌లో మరో నలుగురిని అరెస్ట్ చేసిన ఎన్ఐఎ



న్యూఢిల్లీ, **నవంబర్ 20ప్రజావినికిడి:):** ): ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను ఎన్ఐఎ పట్టుకుంది. గురువారం శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ దాడితో సంబంధం ఉన్న మొత్తం అరెస్టులు 6కి పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తోన్న సంగతి తెలిసిందే. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది. టీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనైన(అమీర్ రషీద్ అలీ)ని, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వాని లను ఔఎం అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ ఇంటరాగేట్ చేస్తోంది.కాగా, ఈ పేలుడు ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్ఐఏ కి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఏజెన్సీ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది. నవంబర్ 10న ఢిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్‌లో ముష్కరమూకలు జరిపిన పేలుడులో 15 మంది మరణించారు.

# తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

### తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దర్శనం
### నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ముర్ము




తిరుమల, **నవంబర్ 20ప్రజావినికిడి:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతోపాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

---------------------

# సోషల్ మీడియా చర్చలో ఎగ్‌ఫ్రీజింగ్

### ముందే దాచుకున్న అండాలతో ఎప్పుడైన గర్భం -ఉపాసనా కామినేని పోస్ట్‌తో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి

హైదరాబాద్,**నవంబర్ 20ప్రజావినికిడి:**
టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదల. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ ఈవెంట్‌లో ఎగ్ ఫ్రీజింగ్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించాయి. అలాగే ఇప్పుడు ఎగ్ ఫ్రీజ్‌పై చర్చలు మొదలయ్యాయి. దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా కనిపిస్తోంది. ఇదో రకంగా మంచిదే. కొత్త అంశాలను నవదంపతులు తెలుసుకునే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇక వివరాల్లోకి వెళితే...ఈ వివాదం నేపథ్యంలో ఉపాసన మళ్లీ స్పందించారు. ఎక్స్ అకౌంట్‌లో తన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఓ పోస్టు చేశారు. కెరీర్‌పై దృష్టి పెట్టే మహిళలు.. తమ ఎగ్స్‌ను ఫ్రీజ్ చేసుకోవాలని, ఆ తర్వాత తమకు నచ్చిన సమయంలో గర్భాన్ని దాల్చాలని ఉపాసన సలహా ఇచ్చారు. ఆ సలహాపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. డాక్టర్లు, ఇన్‌ఫ్లూయన్సెర్లు, సోషల్ మీడియా యూజర్లు ఉపాసన వ్యాఖ్యలను తొలుత తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యల పట్ల స్పష్టత కావాలని కొందరు ఆన్‌లైన్‌లో ఆమెను అడిగారు. ఈ నేపథ్యంలో ఉపాసన మళ్లీ ఎగ్ ఫ్రీజింగ్ గురించి స్పందించారు. అండాల సంరక్షణపై ఆరోగ్యకరమైన చర్చ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. తన వ్యాఖ్యలు ప్రజల్లో చర్చకు దారితీయడం సంతోషకరమని అన్నారు. ప్రజల స్పందన గౌరవిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎగ్ ఫ్రీజింగ్ వల్ల కలిగే లాభనష్టాల గురించి ఆమె వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవాలను ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. పెళ్లి, ఫలదీకరణ గురించి ఆమె తన పోస్టులో రాశారు. తనకు 27 ఏళ్ల వయసులో పెళ్లి జరిగిందని, తన ఇష్టపూర్వకంగా జరిగిందని, 29 ఏళ్ల





వయసులో వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా తన అండాలను ఫ్రీజ్ చేయాలని నిర్ణయించుకున్నానని, 36 ఏళ్ల వయసులో తనకు తొలి సంతానం కలిగిందని, 39 ఏళ్ల వయసులో కవల పిల్లలకు జన్మనివ్వనున్నట్లు ఉపాసన తన పోస్టులో తెలిపారు. పెళ్లి, కెరీర్ మధ్య పోటీ సహజమే అని, కానీ నిండు జీవితంలో అవి రెండు ముఖ్యమే అని, అయితే నేను ఆ రెండింటికి టైం ఫిక్స్ చేసుకున్నానని, తన హక్కును తాను వినియోగించుకున్నట్లు ఉపాసన పేర్కొన్నారు. మర్యాద పూర్వకంగా స్పందిస్తున్న తన ఫాలోవర్లకు ఉపాసన థ్యాంక్స్ చెప్పింది. ఉద్యోగ సంస్థలు మహిళలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్‌లో మాట్లాడుతూ.. మహిళలకు అతిపెద్ద బీమా తమ అండాలను ఫ్రీజ్ చేసుకోవడమే అని ఆమె అన్నారు. ఎందుకంటే ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, ఎప్పుడు పిల్లలను కనాలన్న అంశాలపై నిర్ణయం తీసుకోవడం సులువు అవుతుందన్నారు. ఆర్థికంగా బలోపేతం అయిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేయవచ్చు అని ఆమె అన్నారు. ఎంత మంది పెళ్లి చేసుకోవాలని విద్యార్థులను ఉపాసన ప్రశ్న అడిగిన సమయంలో.. అమ్మాయిల కన్నా అబ్బాయిలే ఎక్కువ మంది చేతులు లేపారు. దీనిపై ఉపాసన స్పందిస్తూ.. ఇది ప్రగతిశీల భారత్‌కు నిదర్శనమన్నారు. ఉపాసన చేసిన ఆ సూచన వల్ల ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. తన సలహా జీవసంబంధమైన పరిమితులకు భిన్నంగా ఉన్నట్లు కొందరు విమర్శకులు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ చికిత్స సులువైన అంశం కాదన్నారు. ఐవీఎఫ్, ఎగ్ ఫ్రీజింగ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఓ ప్రముఖ గైనకాలజిస్ట్ స్పందిస్తూ .. బ్యాంకుల్లో కోట్లు ఉన్నవాళ్లు ఎగ్ ఫ్రీజింగ్ గురించి సలహా ఇవ్వడం సులువే అన్నారు. ఐవీఎఫ్ చికిత్సకు లక్షలు ఖర్చు అవుతోందన్నారు. ఎగ్ ఫ్రీజింగ్ కోసం ప్రతి ఏడాది లక్షల్లో ఖర్చు అవుతుందన్నారు. ఒక్క సిట్టింగ్ కూడా ఖర్చు చేయలేని మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఒకవేళ అండాలను ఫ్రీజ్ చేసినా.. అవి చివరకు విజయవంతంగా గర్భం దాల్చేం అవకాశం ఉంటుందో లేదో చెప్పలేమని మరో గైనిక్ డాక్టర్ అన్నారు.

# కండువా ఊపుతూ హుషారెత్తించిన మోడీ

### సోషల్ మీడియాలో ట్రెండిగ్

పాట్నా, **నవంబర్ 20ప్రజావినికిడి::** ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయ్యారు. . బిహార్‌లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు. వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు. కాగా, బిహార్‌కు పదవసారి ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం



చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా తదితర ఎన్డీయే పెద్దలు హాజరయ్యారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన ఈ వేడుకకు భారీ ఎత్తున జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం మోదీ తన కండువాతో జనాల్ని ఉత్సాహపర్చారు. ముఖ్యమంత్రి, మంత్రుల చేత గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారాలు చేయించారు. ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ (జేడీ-యూ), బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా, మరో 26 మంది మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

# అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ శిల

### అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గుర్తింపు -రోవర్ పంపిన చిత్రాలపై మరిన్ని పరిశోధనలు

న్యూయార్క్,**నవంబర్ 20ప్రజావినికిడి::**
: అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ రాయిని గుర్తించింది. ఈ రాయి మార్స్ సహజ, భౌగోళిక నిర్మాణంతో పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నది. శాస్త్రవేత్తలు 80 సెంటీమీటర్ల పొడవున్న ఈ రాయికి 'ఫిప్సాక్సలా' అని నామకరణం చేశారు. ప్రస్తుతానికి ఈ రాయిని ఎలియన్ రాక్‌గా పేర్కొంటున్నారు. ఈ రాయిని సెప్టెంబర్ 19న గుర్తించారు. నాసా పెర్సెవరెన్స్ రోవర్ పంపిన ఈ రాయిని చూసి నాసా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోవర్ జెజెరో క్రేటర్ సమీపంలోని వెర్నోడెన్ ప్రాంతంలోని రాళ్లపై అధ్యయనం జరుపుతున్నది. రోవర్ మాస్ట్‌క్యామ్-జెడ్ కెమెరా ఈ రాయిని గుర్తించి ఫొటో తీసింది. ఈ ఫొటోను నాసా



బ్లాగ్ పోస్ట్‌లో షేర్ చేసింది. ఫిప్సాక్సలా మరో సౌర వ్యవస్థకు చెందింది కావొచ్చునని తెలిపింది.ఈ రాయి చిన్న డెస్క్‌ను పోలి ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మరో సిద్దాంతం ఏంటంటో ఇది ఉల్కాపాతం ఫలితంగా కూడా వచ్చి ఉండవచ్చని పేర్కొంటున్నారు. క్యూరియాసిటీ రోవర్ 2014లో రెండు మీటర్ల వెడల్పు లెబనాన్ ఉల్కను, 2023లో కాకో ఉల్కను గుర్తించింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు జెజెరో క్రేటర్‌లో ఇలాంటి లోహాలను గుర్తించాలని ఆశించారు. ఈ రాక్‌ను నాసా పరిశోధకుల బృందం గతవారంలో నిశితంగా పరిశీలించింది. రాయి ఆకారం, పరిమాణం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని రాళ్లతో పోలిస్తే భిన్నంగా ఉందని పేర్కొంది. పెర్సెవరెన్స్ రోవర్ సూపర్‌క్యామ్ లేజర్, స్పెక్ట్రోమీటర్లతో చేసిన విశ్లేషణలో ఈ రాయిలో ఐరన్, నికెల్ మూలకాలు ఎక్కువ సాంద్రతతో ఉన్నట్లుగా గుర్తించారు. అంగారకుడి ఉపరితలంపై ఇలాంటి మూలకాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహశకలాల కేంద్ర భాగాల్లో ఏర్పడే ఐరన్-నికెల్ ఉల్కలలో అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో మరో సౌర వ్యవస్థ నుంచి మార్స్‌పైకి వచ్చి ఉండవచ్చని నాసా అంచనా వేస్తున్నది.

# వన్డే సిరీస్‌కు టీమిండియా కెప్టెన్‌గా రాహుల్!

## • దక్షిణాఫ్రికా వన్డేతో రోహిత్, కోహ్లీ పునరాగమనం

భారత్ -దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. మొదటి టెస్ట్ 30 పరుగుల తేడాతో ఓడిపోయిన తర్వాత, టీమ్ ఇండియా ఇప్పుడు నవంబర్ 22 నుంచి గౌహతిలో రెండో టెస్ట్ ఆడనుంది. దీని తరువాత, రెండు జట్లు నవంబర్ 30 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో తలపడనున్నాయి. వన్డే సిరీస్ కోసం బీసీసీఐ ఎలాంటి జట్టును సిద్ధం చేస్తుందో చాలా పేర్లు బయటకు వచ్చాయి. ఈసారి చాలా పెద్ద పేర్ల పునరాగమనం చర్చను మరింత పెంచింది. వన్డే సిరీస్‌కు కెప్టెన్సీ కెఎల్ రాహుల్‌కు దక్కే అవకాశం ఉంది. శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఆడటం అనుమానంగా ఉంది. అటువంటి పరిస్థితిలో, రాహుల్‌ను కెప్టెన్‌గా నియమించడం దాదాపు ఖాయం. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్‌లు నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6 తేదీల్లో జరగనున్నాయి. చాలా కాలం తర్వాత వన్డేల్లో భారత్ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఒకేసారి కనిపించారు. ఆస్ట్రేలియాతో జరిగిన ఇటీవలి వన్డే సిరీస్‌లో రోహిత్ అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రారంభ మ్యాచ్‌లో తక్కువ పరుగులు చేసిన తర్వాత, అతను రెండో వన్డేలో అర్ధ సెంచరీ, మూడవ మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. విరాట్ కోహ్లీ కూడా తన క్లాస్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన తర్వాత, అతను మూడవ వన్డేలో 74 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి భారత్‌ను గెలిపించాడు. ఛేజింగ్‌లో తనకంటే గొప్పవారు లేరని మరోసారి నిరూపించాడు. దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లో ఈ జోడీ జట్టుకు రన్ మెషిన్ అవుతుందని భావిస్తున్నారు. ఆల్



రౌండర్ హార్దిక్ పాండ్యా ఆసియా కప్‌లో గాయపడిన తర్వాత ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. అతని రాక టీమ్ ఇండియా బ్యాలెన్సింగ్‌ను మరింత బలోపేతం చేస్తుంది. హార్దిక్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ముఖ్యమైన పాత్ర పోషిస్తాడు. వేగవంతమైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఆస్ట్రేలియాతో జరిగిన %ూణ×% సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు, కాని ఇప్పుడు అతను కూడా వన్డే సిరీస్‌లో తిరిగి రావచ్చు. అతని ఉనికి భారత బౌలింగ్‌కు పదును పెడుతుంది. అదేవిధంగా, దేశవాళీ క్రికెట్‌లో నిరంతరం పరుగులు సాధిస్తున్న రుతురాజ్ గైక్వాడ్‌కు కూడా జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. అతని ఫామ్, స్థిరత్వం జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్.

# 2026 మినీ వేలాన్ని ఆపేయండి

## • భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప

ఐపీఎల్ 2026 మినీ వేలాన్ని ఆపేయాలని బీసీసీఐకి భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప సూచించాడు. ఈ వేలం ప్రక్రియను ఆపేసి ఏడాది పాటు ఆటగాళ్లను ట్రేడ్ చేసుకునే అవకాశం కల్పించాలన్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఐపీఎల్‌లో మార్పులు చేయాలని తెలిపాడు. రెండున్నర నెలల పాటు నిర్వహిస్తున్న ఈ టోర్నీని 6 నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ప్రాతినిథ్యం వహించిన రాబిన్ ఊతప్ప 205 మ్యాచ్‌లు ఆడి 4952 పరుగులు చేశాడు. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో రాబిన్ ఊతప్ప 660 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. తాజాగా ఐపీఎల్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. లీగ్ స్వరూపాన్ని మార్చాలన్నాడు.'ఐపీఎల్ టోర్నీని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెట్ లీగ్ ఇది. మారుతున్న కాలానికి అనుగుణంగా టోర్నీని మార్చాలి. వేలం ప్రక్రియను నిలిపేసి ఏడాది పాటు ట్రేడ్ విండో తెరిచి ఉంచాలి. వేలాన్ని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. కానీ వారు టీవీ వినోదం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది




కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ 6 నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను నిర్వహించాలి. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి'అని రాబిన్ ఊతప్ప పేర్కొన్నారు. డ్రాఫ్ట్ సిస్టమ్ అంటే ఆటగాళ్లను సమాన పద్దతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చే క్రికెటర్లపై ఒక ఫ్రాంచైజీ గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశపెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి.

# రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ



భారత జట్టు దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడుతోంది. నవంబర్ 22న గౌహతిలో జరిగే రెండవ, చివరి మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఇంతలో, భారత స్టార్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ రింకూ సింగ్ రంజీ ట్రోఫీలో తన బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రింకూ సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. వరుసగా ఫోర్లు, సిక్సర్లు బాదాడు. భారత జట్టు తరపున టెస్ట్ క్రికెట్ ఆడటానికి తన సంసిద్ధతను కూడా అతను సూచించాడు. 2025-26 రంజీ ట్రోఫీలో తమిళనాడుపై జరిగిన మ్యాచ్‌లో భారత యువ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. అతను 247 బంతులు ఎదుర్కొని 176 పరుగులు చేశాడు. రింకు సింగ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఉత్తరప్రదేశ్ తొలి ఇన్నింగ్స్ లో 460 పరుగులు చేసి తమిళనాడుపై ఐదు పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. రింకు తన ప్రత్యేకమైన స్వభావాన్ని ప్రదర్శించి మైదానం అంతటా అద్భుతమైన షాట్లు ఆడాడు. ఉత్తరప్రదేశ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రింకు సింగ్ క్లిష్ట పరిస్థితుల్లో ఈ సెంచరీ చేశాడు. రింకు సింగ్ బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి ఉత్తరప్రదేశ్ 149 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రింకు సింగ్ వచ్చి శివమ్ మావితో కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. జట్టును బలమైన స్థితిలో ఉంచాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ అద్భుతమైన రంజీ ట్రోఫీ సీజన్‌తో దేశీయ క్రికెట్‌లో తన సెంచరీల సంఖ్యను పెంచుకున్నాడు. తరచుగా అగ్రశ్రేణి %ఓ్ష%20 బ్యాట్స్‌మన్‌గా పేరుగాంచిన రింకు సింగ్, టెస్ట్ క్రికెట్ ఆడే తన సామర్థ్యాన్ని మరోసారి ప్రదర్శించాడు. అతను దేశీయ క్రికెట్‌లో తన తొమ్మిదవ సెంచరీని సాధించాడు. భారత టెస్ట్ జట్టులో స్థానం కోసం తన వాదనను కూడా పదిలం చేసుకున్నాడు. ఈ సెంచరీ సెలెక్టర్లకు కూడా ఒక ముఖ్యమైన సందేశాన్ని పంపింది. రింకు సింగ్ దేశీయ టెస్ట్ కెరీర్‌లో 57 సగటుతో 3600 పరుగులు సాధించాడు. ఈ కాలంలో అతను తొమ్మిది సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఈ గణాంకాలు అతను రెడ్-బాల్ క్రికెట్‌లో కూడా స్థిరంగా పరుగులు సాధిస్తున్నాడని సూచిస్తున్నాయి. భవిష్యత్తులో అతను భారత టెస్ట్ జట్టులో కూడా స్థానం సంపాదించవచ్చు.



# దీక్ష స్వర్ణ చరిత్ర

## మహిత్‌కు రజతం.. బధిర ఒలింపిక్స్

టోక్యో : బధిర ఒలింపిక్స్‌లో భారత గోల్ఫర్ దీక్షా డాగర్ చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన మహిళల వ్యక్తిగత స్ట్రోక్‌ప్లే ఫైనల్ రౌండ్‌లో 24 ఏళ్ల దీక్ష అద్భుత ప్రదర్శనతో స్వర్ణం దక్కించుకుంది. 2021 బధిర ఒలింపిక్స్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్న దీక్షా డాగర్ ఈసారి ఆ పతకాన్ని నిలబెట్టుకోవడం ద్వారా కొత్త చరిత్ర లిఖించింది. షూటింగ్ మహిళల 50 మీ. ప్రోన్ ఫైనల్లో మహిత్ సంధూ 246.1 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం చేజిక్కించుకుంది. ఈ ఒలింపిక్స్‌లో మహిత్ సంధూకిది మూడో పతకం. క్వాలిఫికేషన్‌లో సంధూ ప్రపంచ రికార్డు సృష్టించింది.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ

## • పలువురు స్టార్ ప్లేయర్ల కోసం సిద్ధం

అబుదాబిలో డిసెంబర్ 16న ఐపీఎల్ 2026 మినీ వేలం జరగనుంది. ఇక పలువురు స్టార్ ప్లేయర్ల కోసం.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్స్‌కు రెడీ అవుతున్నాయి. అయితే ఈసారి చాలా మంది ఆటగాళ్లు వేలంలోకి వస్తుండగా.. వారిపై భారీ ధర పలికే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకూ ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడైన రిషబ్ పంత్ రికార్డును కూడా బద్దలు కొట్టేందుకు.. ఓ ముగ్గురు ప్లేయర్లు లైన్‌లో సిద్ధంగా ఉన్నారు. ఐపీఎల్ 19వ సీజన్ వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరగనుంది. అయితే ఇది మినీ వేలం కావడంతో ఒకే రోజులో క్లోజ్ అవ్వనుంది. కామెరాన్ గ్రీన్ నుండి ఆండ్రీ రస్సెల్ వరకు.. పలువురు స్టార్ ఆటగాళ్ల కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీలు భారీ బిడ్లకు సిద్ధమవుతున్నాయి. పంత్ పేరు మీదున్న రూ. 27 కోట్ల రికార్డు కూడా చెరిగే అవకాశం ఉంది. ఈ వేలంలో అందరి కంటే ముందున్న ఆటగాడు.. ఆస్ట్రేలియాకు చెందిన విధ్వంసక ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్. ఐపీఎల్ 2026 మినీ వేలంలోకి కామెరాన్ కూడా రానున్నాడు. ఐపీఎల్ 2024లో ఈ ప్లేయర్‌ని ఆర్సీబీ..ముంబై ఇండియన్స్ నుండి రూ. 17.5 కోట్లకు ట్రేడ్ చేసుకుంది. అయితే ఐపీఎల్ 2025 సీజన్‌లో కామెరాన్ గ్రీన్



గాయం కారణంగా ఆడలేకపోయాడు. కానీ ఈసారి ఫుల్ ఫామ్‌తో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మెగా వేలంలో ఈ ఆటగాడి కోసం ఫ్రాంచైజీల మధ్య గట్టి పోటీ ఉండబోతోంది. కామెరాన్ గ్రీన్‌పై రూ. 25 కోట్ల వరకు బిడ్ పడే అవకాశం ఉంది. ఇక 2014 ఐపీఎల్ నుండి కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆడుతున్న ఆండ్రీ రస్సెల్‌ను..ఈసారి రిలీజ్ చేయడంతో మినీ వేలంలోకి రాబోతున్నాడు. గత సీజన్‌లో ఈ ఆల్‌రౌండర్‌ను మెగా వేలంలో రూ. 12 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. బ్యాట్, బాల్ రెండింటితోనూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం ఇతని సొంతం. అందువల్ల ఆండ్రీ రస్సెల్‌పై భారీ బిడ్ పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన శ్రీలంక ఫాస్ట్ బౌలర్ మతీష పతిరానాను.. ఈసారి విడుదల చేసింది. ఐపీఎల్ 2025లో మతీషను రూ. 13 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకున్నారు. ఈ సూపర్ బౌలర్‌కు డెత్ ఓవర్లలో వికెట్లు తీయగల అద్భుతమైన సామర్థ్యం ఉంది. మతీష పతిరానాపై కూడా రూ. 10 కోట్ల వరకు బిడ్ పడే ఛాన్స్ ఉంది.

# నేటి నుండి యాషెస్ సిరీస్



## • సిద్ధంగా ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్లు

## • పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం

టెస్టు క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక సిరీస్ యాషెస్ కు అంతా రెడీ అయ్యింది. ఆస్ట్రేలియా వేదికగా మరికొన్ని గంటల్లోనే ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్- ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఈ యాషెస్ టెస్టు సిరీస్‌ను క్రికెట్‌లో అతిపెద్ద టెస్టు సిరీస్‌గా అభివర్ణిస్తారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నవంబర్ 21న పెర్త్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈసారి ఈ సిరీస్‌కు ఆస్ట్రేలియా ఆతిథ్యం ఇస్తుంది. ఇరుజట్ల ఆటగాళ్లు ఇప్పటికే నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ద్వైపాక్షిక సిరీస్‌లు ఎన్ని ఉన్నప్పటికీ, ఇరుజట్లు ఈ సిరీస్‌ను మాత్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ సిరీస్‌లో నెగ్గాలని తీవ్రంగా ప్రయత్నిస్తాయి. ఈ క్రమంలోనే కాంట్రవర్సీలు, ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధాలు ఇవన్నీ ఇంకొక ఎత్తు! ఇందులో బ్యాటర్ సెంచరీ చేసినా, బౌలర్ ఐదు వికెట్లు కూల్చినా ఆ ప్లేయర్ పేరు మార్మోగిపోతుంది. అలాంటి సిరీస్‌కు ఆసీస్, ఇంగ్లాండ్ ప్లేయర్లు రెడీ అయ్యి, టెస్టు క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ మజా ఇవ్వనున్నారు. ఆస్ట్రేలియా పిచ్‌లపై ఫాస్ట్ బౌలర్ల ఆధిపత్యం ఉంది. రేపు పెర్త్ స్టేడియంలో జరగనున్న యాషెస్ తొలి మ్యాచ్‌లోనూ పిచ్ పేసర్లకే సహకరించవచ్చు! అలాగే ఈ పిచ్‌పై టెస్టుల్లో ఆసీస్‌కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆతిథ్య ఆస్ట్రేలియా ఇక్కడ నాలుగు మ్యాచ్‌లు గెలిచింది. పెర్త్ స్టేడియంలో జరిగిన అన్ని టెస్ట్ మ్యాచ్‌ల్లో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచింది. అందుకే ఈ మ్యాచ్‌లో టాస్ కీలక పాత్ర పోషిస్తుంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ తీసుకనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పెర్త్ వేదికగా జరిగనున్న తొలి టెస్టు ఉదయం 7:50 గంటలకు ప్రారంభమవుతుంది. దీనికి అరగంట ముందు టాస్ పడుతుంది. టీవీలో స్టార్ స్పోర్ట్స్‌కు సంబంధించిన ఛానెళ్లలో లైవ్ చూడవచ్చు. అలాగే జియో హాట్‌స్టార్ ఓటీటీలో లైవ్ స్ట్రీమింగ్ చేయవచ్చు. అయితే దీనికి సబ్‌స్క్రిప్షన్ తీలుకోవాల్సి ఉంటుంది. కానీ జియో యూజర్లకు ఎంపిక చేసిన ప్లాన్‌పై ఫ్రీగా అందిస్తోంది. కాగా, ఈ సిరీస్ 1882- 83లో ప్రారంభమైంది. అంటే దీని చరిత్ర 140 సంవత్సరాలకు పైమాటే! ఇరు దేశాలకు ఈ సిరీస్ ప్రతిష్ఠాత్మకం. ఇప్పటిదాకా యాషెస్‌లో 73 సిరీస్‌లు జరిగాయి. చివరిసారిగా 2023లో సిరీస్ జరిగింది. అప్పుడు ఆస్ట్రేలియా విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా ఆసీస్ 34సార్లు నెగ్గగా, ఇంగ్లాండ్ 32 సార్లు సిరీస్‌లో దక్కించుకుంది. 7 సిరీస్‌లు డ్రా గా ముగిశాయి. ఇక టెస్టుల విషయానికొస్తే, 364 టెస్టు మ్యాచ్‌ల్లో ఆసీస్- ఇంగ్లాండ్ తలపడ్డాయి. ఇందులోనూ ఆస్ట్రేలియా ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఆసీస్ 152 టెస్టుల్లో విజయం సాధించగా, ఇంగ్లాండ్ 112 మ్యాచ్‌ల్లో నెగ్గింది. మరో 97 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఇంగ్లాండ్ జట్టు: బెన్ డకెట్, జాక్ క్రాలే, ఓల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, బ్రైడాన్ కార్సే, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, మాథ్యూ పాట్స్, జోష్ టోంగ్, విల్ జాక్స్ ఆస్ట్రేలియా జట్టు : ఉస్మాన్ ఖవాజా, జేక్ వెదరాల్, మార్నస్ లాబుషేన్,స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, కామెరాన్ గ్రీన్, అలెక్స్ కేరీ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, నాథన్ లియాన్, బ్రెండన్ డాగెట్, స్కాట్ బోలాండ్, బ్యూ వెబ్‌స్టర్, జోష్ ఇంగ్లిస్, మైఖేల్ నెసెర్

# పైరసీపై కొత్త పోరు..

## రూ.99కే సినిమా టికెట్ ప్రకటించిన ఈటీవీ విన్!




పైరసీపై పోరాటంలో భాగంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ ఒక కీలక ముందడుగు వేసింది. తమ సంస్థ నిర్మించిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా టికెట్ ధరను కేవలం రూ.99గా నిర్ణయించినట్లు ప్రకటించింది. సింగిల్ థియేటర్లలో ఈ ధర వర్తిస్తుండగా, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ.105గా ఉంటుందని తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, పైరసీని అరికట్టవచ్చని సంస్థ భావిస్తోంది. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో 'రాజు వెడ్స్ రాంబాయి' ప్రీ-రిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ, "ఇటీవల ఐబొమ్మ రవి అరెస్ట్ తర్వాత, సినిమా టికెట్, పాప్‌కార్న్ ధరలు తగ్గితే థియేటర్లకు వస్తామని చాలా మంది అభిప్రాయపడ్డారు. వారి అభిప్రాయాన్ని గౌరవించే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం" అని వివరించారు. రవిని అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. గతంలో తమ సంస్థ నుంచి వచ్చిన 'క' సినిమాను పైరసీ కాకుండా విజయవంతంగా అడ్డుకున్నామని సాయికృష్ణ గుర్తుచేశారు. "పైరసీ మన నుంచే మొదలైంది, దాన్ని ఆపే బాధ్యత కూడా మనదే. ప్రతి ఒక్కరూ థియేటర్లలో సినిమా చూసి సహకరించాలి" అని ఆయన ప్రేక్షకులను కోరారు. అఖిల్, తేజస్విని జంటగా నటించిన ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. ఈ సినిమా నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువ హీరో కిరణ్ అబ్బవరం హాజరు కాగా, చిత్రబృందం మొత్తం పాల్గొంది.


# ఏప్రిల్లో ఉస్తాద్ భగత్ సింగ్

2023లో బ్రో మూవీతో పలకరించాక రెండేళ్లకు పైగా బాక్సాఫీస్ పోటీకి దూరంగా ఉన్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. ఈ ఏడాది రెండు నెలల వ్యవధిలో రెండు సినిమాలతో పలకరించాడు. జులైలో హరిహర వీరమల్లు రిలీజైతే.. సెప్టెంబర్లో ఓజీ విడులైంది. మొదటి సినిమా నిరాశపరిచినా.. రెండో మూవీ అభిమానులతో పాటు సామాన్య ప్రేక్షకులనూ మెప్పించింది. ఈ రెండు చిత్రాలను పూర్తి చేసిన వెంటనే పవన్.. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీని కూడా టేకప్ చేయడం.. వరుసగా కాల్ షీట్స్ ఇచ్చి చకచకా తన పార్ట్ షూటింగ్ అంతా పూర్తి చేయడం తెలిసిందే. మరి ఈ మూవీ రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఐతే పవన్ తన పార్ట్ వరకు చిత్రీకరణ పూర్తి చేసినప్పటికీ.. ఇంకా కొంత షూట్ మిగిలే ఉండడంతో సినిమా కొంచెం ఆలస్యం కానున్నట్లు ఇప్పటికే చిత్ర వర్గాలు సంకేతాలు ఇచ్చాయి. వచ్చే రెండు మూడు నెలల్లో అయితే రిలీజ్‌కు స్కోప్ లేదు. అలాంటపుడు వేసవికే విడుదల ఉండొచ్చని భావిస్తున్నారు. ఇప్పుడు స్వయంగా నిర్మాత రవిశంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ గురించి క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రం ఏప్రిల్లో విడుదలవుతుందని ఆయన ప్రకటించారు. తమ ప్రొడక్షన్లో రానున్న కొత్త చిత్రం ఆంధ్ర కింగ్ తాలూకా ప్రమోషన్లలో భాగంగా ఆయన తమ సంస్థ సినిమాల గురించి మాట్లాడారు. రామ్ చరణ్ పెద్ది మూవీ మార్చిలోనే రాబోతోందని నొక్కి వక్కాణించిన రవిశంకర్... ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రీకరణ పూర్తి చేసుకుందని, వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపారు.సంక్రాంతికి సినిమాను రెడీ చేసే అవకాశమున్నా.. అప్పుడు చిరు సినిమా మన శంకర వరప్రసాద్ ఉండడంతో వేసవి వైపు దృష్టి మళ్లింది. మార్చిలో రామ్ చరణ్ సినిమా వస్తుంది కాబట్టి.. ఆ నెలను విడిచిపెట్టి ఏప్రిల్‌ను ఎంచుకున్నారు. మేలో ఎలాగూ చిరు మరో సినిమా విశ్వంభర వస్తుందనే అంచనాలున్నాయి. హరీష్ శంకర్ డైరెక్ట్ చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో చిరు సరసన శ్రీలీల, రాశి ఖన్నా నటించారు.



# జపాన్ ఫ్యాన్స్‌ను కలిసేందుకు ప్రభాస్..

## ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న డార్లింగ్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన జపాన్ అభిమానులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. తన సినిమాలకు జపాన్‌లో లభిస్తున్న ఆదరణ నేపథ్యంలో, అక్కడి అభిమానులను స్వయంగా కలిసేందుకు ఆయన వచ్చే నెలలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటన కోసం ప్రస్తుతం నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రీకరణ నుంచి ఆయన స్వల్ప విరామం తీసుకోనున్నారు.'బాహుబలి' నుంచి ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఎ.డి' వరకు ప్రభాస్ చిత్రాలు జపాన్‌లో భారీ విజయాన్ని సాధించాయి. దీంతో అక్కడ ఆయనకు బలమైన అభిమానగణం ఏర్పడింది. నిజానికి 'కల్కి' విడుదల సమయంలోనే జపాన్ వెళ్లాలని ప్రభాస్ భావించారు. అయితే, అప్పుడు కాలి గాయంతో బాధపడుతుండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. త్వరలోనే తప్పకుండా వస్తానని ఓ వీడియో సందేశం ద్వారా అభిమానులకు హామీ ఇచ్చారు.ఇప్పుడు ఆ వాగ్దానాన్ని నెరవేర్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. మరోవైపు, ఈ నెలాఖరులో ప్రభాస్ తన కొత్త సినిమా 'స్పిరిట్'ను ప్రారంభించనున్నారు. ఈ చిత్రం కోసం ఆయన తన లుక్‌ను మార్చుకునే పనిలో ఉన్నారని సమాచారం. జపాన్ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక, కొత్త సినిమాల షూటింగ్‌లతో పాటు 'రాజాసాబ్' ప్రచార కార్యక్రమాలతో ఆయన బిజీ అవ్వనున్నారు.

# మోడ్రన్ స్త్రీ: ఉపాసన ఫేవరిజం

స్త్రీ ఆకాశంలో సగం. పురుషుడిలోను సగం. కానీ సంఘంలో స్త్రీ స్థానం ఎక్కడ ఉంది? మగువకు అర్ధరాత్రి స్వాతంత్ర్యం సంపూర్ణంగా అందుతోందా? ఇవన్నీ ఇప్పటికీ శేష ప్రశ్నలుగానే ఉన్నాయి. అయితే ఆడది తనకు తానుగా ఆర్థిక స్వావలంబన సాధించాలని, మానసిక శారీరక - ఆరోగ్యం సహా స్వయం ఉపాధిలోను సమృద్ధిగా ఉన్నప్పుడే తనను తాను సంస్కరించుకోగలదనే అభిప్రాయం వ్యక్తం చేసారు ఉపాసన. స్త్రీలు వివాహం చేసుకున్నా కెరీర్ ని కూడా కొనసాగించాలని, అయితే దీనికోసం భాగస్వామితో కలిసి నిర్ణయం తీసుకోవాలని ఉపాసన సూచించారు. నేటి మహిళలకు ఆర్థిక స్థిరత్వం చాలా అవసరం. తన కాళ్లపై తాను నిలబడాలి. అలాగే స్త్రీ ఇతరుల ఒత్తిడితో పని లేకుండా తనకు తగ్గ వ్యక్తిని ఎంపిక చేసుకునే అవకాశం ఉండాలి! అని కూడా ఉపాసన అన్నారు. నేటితరం ఇతరుల ఒత్తిడి కంటే నిజాయితీతో కూడిన సంబంధం కోసం వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటున్నారని కూడా ఉపాసన అన్నారు. ప్రస్తుతం ఉపాసన అభిప్రాయం జాతీయ స్థాయిలో డిబేట్ గా మారింది. పెళ్లిలో అస్థిరత, గృహ హింస గురించి ఉపాసన గతంలో తన దృక్పథాన్ని వెల్లడించారు. స్త్రీలను గౌరవించి పూజించకపోతే దేవుడి గుడిలో దేవత విగ్రహం ఎందుకు? అని కూడా ప్రశ్నించారు. ఇప్పుడు స్త్రీ ఆర్థిక భద్రత గురించి, భర్త విషయంలో స్త్రీల ఎంపిక గురించి ఉపాసన సూటిగా మాట్లాడటం ఆసక్తిని పెంచుతోంది. కెరీర్- పెళ్లి కచ్చితంగా అమ్మాయి విషయంలో కలిసే ఉండాలని కూడా కుండబద్దలు కొట్టారు. ప్రతి స్త్రీ భవిష్యత్ ని భద్రంగా ఉంచుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు.' స్త్రీలు తమ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మానసిక శ్రేయస్సు చాలా ముఖ్యమని కూడా సూచించారు. మహిళలు తమ సొంత లక్ష్యాలను, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడానికి టైమ్ ని మ్యానేజ్ చేయడం నేర్చుకోవాలని కూడా అన్నారు. ఉపాసన ఆదర్శవంతమైన సూచనలపై ఇప్పుడు జాతీయ స్థాయిలో డిబేట్ కొనసాగుతోంది. ఉపాసనపై నెటిజనులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



# అందాల భామకి ఎక్కడ తేడా కొడుతుంది..?



అందం అభినయం ఉంటే చాలు వరుస ఛాన్స్ లు వచ్చేస్తాయి. కానీ ఆ రెండిటిలో పాటు లక్ అనే ఫ్యాక్టర్ కూడా ఉండాలి లేదంటే కాస్త ఇబ్బంది పడక తప్పదు. ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లోనే ఉంది అందాల భామ భాగ్య శ్రీ బోర్స్. మామూలుగా అయితే రవితేజ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ కి హిట్ క్రేజ్ రావడమే కాదు కెరీర్ అదిరిపోతుంది. అదే దారిలో మిస్టర్ బచ్చన్ తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ బోర్స్. ఐతే ఆ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు కాబట్టి ఫస్ట్ షాక్ తగిలినట్టు అయ్యింది.భాగ్య శ్రీ బోర్స్ థర్డ్ అటెంప్ట్ గా వచ్చిన కాంత.. ఐతే అది ఫ్లాప్ అయినా అమ్మడికి వరుస ఛాన్స్ లు వచ్చాయి. రెండో సినిమాగా రిలీజైన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ మీద చాలా హోప్స్ పెట్టుకుంది భాగ్య శ్రీ. ఐతే ఆ సినిమా కూడా నిరాశపరచింది. ముఖ్యంగా భాగ్య శ్రీ రోల్ కూడా రన్ టైమ్ లిమిటేషన్స్ వల్ల క్లారిటీ లేకుండా పోయింది. ఇక థర్డ్ అటెంప్ట్ గా వచ్చిన కాంత సినిమా కూడా కమర్షియల్ సక్సెస్ అందుకోలేదు. తెలుగులో దుల్కర్ సినిమా అంటే కచ్చితంగా సూపర్ హిట్టే అనే రేంజ్ క్రేజ్ ఏర్పరచుకున్నాడు. అలాంటి దుల్కర్ తో కాంత సినిమా చేసిన భాగ్య శ్రీ ఆ సినిమాతో కూడా ఫెయిల్యూర్ చవిచూసింది. ఐతే 3 సినిమాల్లో కింగ్ డమ్ లో తప్పితే మిగతా రెండిటిలో అటు గ్లామర్ పరంగా యాక్టింగ్ పరంగా భాగ్య శ్రీకి మంచి మార్కులే వేశారు ఆడియన్స్. రామ్ తో జత కట్టిన ఈ అమ్మడు.. ఇక ఫైనల్ గా అమ్మడి చేతిలో ఉన్న ఒకే ఒక్క సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా. రామ్ తో జత కట్టిన ఈ అమ్మడు అతనితో తొలి హిట్ అందుకుంటుందా అన్నది ఎగ్జైటింగ్ గా ఉంది. రామ్ తో తొలి పరిచయమైన ఇలియానా, కీర్తి సురేష్ లాంటి వాళ్లు స్టార్ హీరోయిన్స్ గా ఒక రేంజ్ కి వెళ్లారు. మరి అదే దారిలో భాగ్యానికి రామ్ సినిమా సక్సెస్ అందిస్తుందేమో చూడాలి. రామ్ భాగ్య శ్రీ చేసిన ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా ప్రమోషన్స్ అయితే ఇంప్రెసివ్ గా ఉన్నాయి.. ఈ సినిమా ఒక ఫ్యాన్ బయోపిక్ గా మేకర్స్ చెబుతూ వస్తున్నారు. మరి సినిమాతో భాగ్యానికి ఏమేరకు లక్ కలిసి వస్తుందో చూడాలి. ఆంధ్రా కింగ్ తాలూకా రిజల్ట్ ని బట్టే భాగ్య శ్రీ కెరీర్ ఆధారపడి ఉంటుందని చెప్పొచ్చు. ముఖ్యంగా సినిమా హిట్ పడితే అమ్మడు కూడా మరింత రెచ్చిపోదామనే ప్లాన్ తోనే ఉంది. మరి భాగ్యం కోరుకున్న ఆ ఒక్క హిట్ సినిమా ఆంధ్రా కింగ్ అవుతుందా లేదా అన్నది ఈ మంత్ ఎండ్ సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది. హీరో రామ్ కూడా ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా మీద చాలా హోప్స్ పెట్టుకునాడు. అతను కూడా ఈమధ్య వరుస ఫ్లాపులతో కెరీర్ ట్రాక్ తప్పాడు.

# 'కొదమసింహం' రీ రిలీజ్..

## పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి నటించిన క్లాసిక్ కౌబాయ్ చిత్రం 'కొదమసింహం' 35 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయనుంది. 1990లో విడుదలైన ఈ సినిమాను ఈ నెల 21న రీ రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చిరంజీవి హాజరుకాకపోయినా, ఓ స్పెషల్ వీడియో ద్వారా సినిమాకు సంబంధించిన మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు.కౌబాయ్ సినిమాలంటే తనకు చాలా ఇష్టమని, కానీ అలాంటి చిత్రంలో తాను నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదని చిరంజీవి అన్నారు. "అప్పటికే కృష్ణ గారు నటించిన 'మోసగాళ్లకు మోసగాడు' సంచలనం సృష్టించింది. ఆ సమయంలో మరో కౌబాయ్ సినిమా చేయడం సాహసమే. నిర్మాత కైకాల నాగేశ్వరరావు గారు దర్శకుడు మురళీ మోహన్ రావును పరిచయం చేసి కథ చెప్పించారు. కథ నచ్చడంతో వెంటనే అంగీకరించాను. తొలిసారి గడ్డం పెంచి నటించిన సినిమా ఇదే" అని గుర్తుచేసుకున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు పోషించిన 'సుడిగాలి' పాత్ర తన ఫేవరెట్ అని చిరంజీవి తెలిపారు. ఆ పాత్రకు మోహన్‌బాబు తప్ప మరెవరూ న్యాయం చేయలేరని ప్రశంసించారు. లెజెండరీ నటుడు ప్రాణ్‌తో కలిసి పనిచేయడం అదృష్టమన్నారు. రాజ్-కోటి అద్భుతమైన సంగీతం అందించారని, ప్రభుదేవా కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచిందని చెప్పారు. ఓ పాటలో గోడపైకి డ్యాన్స్ చేస్తూ వెళ్లే సీన్‌ను హాలీవుడ్ సినిమా స్ఫూర్తితో తీశామని, అప్పట్లో అది అందరినీ ఆశ్చర్యపరిచిందని అన్నారు. ఈ సినిమాతో రామ్ చరణ్‌కు ఉన్న అనుబంధాన్ని కూడా చిరంజీవి పంచుకున్నారు. "చిన్నప్పుడు చరణ్ భోజనం చేయాలంటే వాళ్లమ్మ ఈ సినిమా క్యాసెట్ పెట్టాల్సిందే. అప్పుడే వాడు అన్నం తినేవాడు" అని నవ్వుతూ చెప్పారు. ఈ తరం ప్రేక్షకులు కూడా 'కొదమసింహం' చిత్రాన్ని తప్పకుండా ఆస్వాదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613